# సౌందర్య రహస్యం

ప్రకాశం పెద్ద సంపాదనగలవాడు కాదు. కాని అతని ఇల్లు - అద్దె ఇల్లే- గొప్ప ఆర్ట్ డైరెక్టర్ తీర్చిదిద్దినట్టుంది. మేమందరమూ, అతని భార్యను మెచ్చుకుని, “ఇల్లు ఇలా పెట్టినందుకు ఎన్ని వందలైనా ఇయ్యొచ్చు! గనక జీతంలేని చాకిరీ చేస్తున్నది” అనేవాళ్లం.

ప్రకాశం మాతో ఏకీభవించేవాడు.

“జీవితం అందంగా ఉండాలి. ఎంత పేదవాళ్లయినా జీవితాన్ని అందంగా చేసుకోవచ్చు. మన దరిద్ర నారాయణులకు ఆ విద్య తెలిసిననాడు విప్లవం వచ్చినట్టే!” అనేవాడు ప్రకాశం.

మరి అలాటివాడు అంత అందవికారమైన పనిమనిషి, ధనలక్ష్మిని - ఎందుకు పెట్టుకున్నాడో మాకు తెలిసేది కాదు. ప్రకాశం ఇంట్లో వికారమైన దినుసు ఏదన్నా ఉంటే అది ధనలక్ష్మి. బహుశా చౌకగా వచ్చిందని పెట్టుకుని ఉంటాడు. దానిజీతం నెలకు పదిహేను రూపాయలు - అయిదురోజులపాటీ చౌకపారు తిండి తినటానికి చాలుతుంది. నెలకు మిగిలిన ఇరవై రోజులూ ఏ తింటుందో మనకెందుకు?

ఇంతలో ఒకరోజు నేను ప్రకాశం ఇంటికి వెళ్లేసరికి ఇల్లు ధర్మసత్రం చావడిలాగా ఉంది. నేల ఊడ్చినట్టు లేదు. ఒక మూల మురికిగుడ్డలు కుప్పగా ఉన్నాయి. వంట ఇంటి పక్కన డాబాలో రెండు డజన్ల ఎంగిరి కంచాలూ, అంట్ల పాత్రలూ, గరిటెలూ, సబ్బులూ, కడగని గ్లాసులూ ఉన్నాయి.

“ఏమిటోయ్ ఇది ప్రకాశం?” అన్నాను.

“పనిచేసే పక్ష్మి నిన్నటినుంచి రావటంలేదు. దాని మొగుణ్ని ఆస్పత్రిలో చేర్చారట!” అన్నాడు ప్రకాశం చిరాకుగా.

*ముద్రణ : ?*

*ముద్రణ : కుటుంబరావు సాహిత్యం ఆరవ సంపుటం,*

*విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, డిసెంబర్ 1994*